క్లుప్తంగా

పాఠశాలల తనిఖీ



విద్యార్థులతో చదివిస్తున్న ఆడే ప్రకాశ్

కెరమెరి: మండలంలోని పార్ధ, రాంనగర్, కొఠారి పాఠశాలలను మంగళవారం మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. విద్యార్థులతో తెలుగు, ఆంగ్లం చదివించారు. బోర్డుపై అక్షరాలు రాయించారు. విద్యార్థులకు చదవడం, రాయడం రావాలన్నారు. ప్రతీరోజు ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో విద్యార్థుల హాజరు వేయాలని సూచించారు. అలాగే ఎండీఎంలో పాల్గొన్న విద్యార్థుల వివరాలు అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు శైలజ, సరిత, కిరణ్మయ్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

బెజ్జూర్: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు అబ్దుల్ మతీన్ తల్లి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మంగళవారం వారి నివాసానికి చేరుకొని పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు జగ్గాగౌడ్, మాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ, బీఆర్‌ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు నరేందర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

భీమారం: డీసీఎంఎస్ ద్వారా భీమారం మండలం బూర్గుపల్లిలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎన్నికల నేపథ్యంలో మంగళవారం రైతులు ప్రారంభించారు. గతంలో ఎప్పుడైనా వివిధ పార్టీలకు చెందిన నాయకులతో పాటు ప్రజాప్రతినిధులు కేంద్రాలను ప్రారంభించే వారు. అయితే ఎన్నికల కోడ్ ఉన్న పరిస్థితుల్లో రైతులే ముఖ్యఅతిథులుగా మారారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భీమారం: మండల కేంద్రంలోని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండల పరిధిలోని గ్రామాలకు బుధవా రం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరా యం ఉంటుందని ఏఈ కుమారస్వామి తెలి పారు. సబ్‌స్టేషన్‌కి 33 కేవీ లైన్ నిర్మించే పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ విషయంలో ప్రజలు సహకరించాలని కోరారు.

అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీ పరిశీలన

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లి గ్రామంలోని పీహెచ్‌సీని మంగళవారం వరల్డ్ హెల్త్ ఆర్గనైజర్ జోనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ శిరీష పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో కుష్టు వ్యాధి కేసులు ఎన్ని ఉన్నాయో పరిశీలించారు. వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి కృష్ణతేజ, డీపీఎంవోలు శివకుమార్, రాఘవయ్య, హెచ్ఈవో జగదీశ్, సబ్ యూనిట్ అధికారి పుట్ట సత్తయ్య, ఏఎస్ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు వినియోగించుకోవాలి

కాసిపేట: ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాల్సిందిగా కాసిపేట ఎస్సై గంగారాం సూచించారు. మండలంలోని కోమటిచేనులో ఓటర్లకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎటువంటి ప్రలోబాలకు, భయభ్రాంతులకు లొంగకుండా పోలీసు శాఖ నమ్మకం కల్పిస్తుందని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసులు పాల్గొన్నారు.

సన్మానం

పాతమంచిర్యాల: మంచిర్యాల ఎల్ఐసీ బ్రాంచ్‌లో ఏజెంట్‌గా పనిచేస్తున్న సిరిపురం శ్రీనివాస్‌ను ఎల్ఐసీ బ్రాంచ్ అధికారులు బుధవారం ఘనంగా సన్మానించారు. శ్రీనివాస్ 33 సంవత్సరాలుగా ఏజెంట్‌గా, చైర్మన్ క్లబ్ మెంబర్‌గా కొనసాగుతూ యూఎస్ఏలో నిర్వహించే 2024ఎండీఆర్టీ మిలియన్ డాలర్ రౌండ్‌టేబుల్ సమావేశానికి అర్హత సాధించిన సందర్భంగా సమావేశం నిర్వహించి సన్మానం చేశారు.

23న మండల సమావేశం

మందమర్రిరూరల్: ఎంపీడీవో కార్యాలయంలో 23న ఉదయం 11గంటలకు ఎంపీపీ మంగ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శశికళ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

విద్యావంతులకే ఓటు

కౌటాల: రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో విద్యావంతులకే తమ ఓటు వేస్తామని కొత్తగా ఓటు హక్కు పొందిన కౌటాల మండలానికి చెందిన యువతులు పేర్కొంటున్నారు. ఓటు హక్కు వినియోగంపై 'సాక్షి'తో తమ అభిప్రాయాలు పంచుకున్నారు.

జంగ్ తెలంగాణ

విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి



విద్యకు ప్రాధాన్యత ఇచ్చే అభ్యర్థికే ఎన్నికల్లో నా తొలి ఓటు వేస్తాను. విద్యావంతులకే మెరుగైన విద్యను అందించాలనే ఉద్దేశం ఉంటుంది. యువతుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. గ్రామీణ యువతులు చదువుకొని ఎలాంటి ఉపాధి లేకుండా ఉంటున్నారు. యువతులకు ప్రత్యేక శిక్షణా తరగతులు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలి.

\- శ్రీలత, యాపలగూడ

ఉద్యోగ అవకాశాలు పెంచాలి



ప్రభుత్వాలు ఉద్యోగ అవకాశాలు మెరుగుపర్చాలి. నిరుద్యోగుల డిమాండ్లను పరిష్కరించే వారికే నా తొలి ఓటు వేస్తాను. ఏళ్లుగా నిరుద్యోగ సమస్య పరిష్కారం కాకపోవడం చాలా బాధాకరం. గ్రామీణ ప్రాంతాల్లో యువతులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. నిజాయితీ గల నాయకులకే మద్దతు ఇస్తాను.

\- శిరీష, యాపలగూడ

నిస్వార్థంగా సేవ చేయాలి



నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి నిస్వార్థంగా సేవ చేయాలి. ప్రతీ నెలలో ఒకరోజు గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలి. అలాంటి నిజాయతీ పరులైన వారికే నా తొలి ఓటు వేస్తాను. ఎన్నికల వేళ అమలు కాని హామీలు ఇచ్చి మర్చిపోయే వారికి తగిన బుద్ధి చెబుతాం.

\- మహేశ్వరి, యాపలగూడ

కందిపోతున్న ఆశలు..!

- పంటకు తెగుళ్ల బెడద
- ఎండిపోతున్న మొక్కలు
- విపరీతంగా పెరిగిన గడ్డి
- జిల్లాలో 46వేల ఎకరాల్లో సాగు



ముత్తంపేటలో సాగు చేసిన కంది పంట

కౌటాల: జిల్లాలో ఖరీఫ్‌లో ఈసారి వర్షాలు లేకపోవడంతో పత్తి, కంది పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. సీజన్ ప్రారంభంలో ఆలస్యంగా వర్షాలు కురువడంతో కంది విత్తనాలను ఆలస్యంగా విత్తుకున్నారు. అనంతరం కురిసిన వర్షాలతో విత్తనాలు మొలకెత్తాయి. కానీ గత రెండు నెలలుగా వానలు లేకపోవడంతో మొక్కల ఎదుగుదల లోపించింది. పైగా పంటలో విపరీతంగా గడ్డి పెరగడంతో పాటు మొక్కలకు ఎండు తెగులు సోకి మొక్కలు ఎండిపోతున్నాయి.

46వేల ఎకరాల్లో సాగు..

జిల్లా రైతులు ఏటా కంది పంటను అంతర పంటగానే సాగు చేస్తున్నారు. కానీ కంది పంటకు మంచి మద్దతు ధర లభిస్తుండడంతో ఈసారి అంతర పంటగానే కాకుండా ప్రధాన పంటగా కూడా సాగు చేశారు. జిల్లాలో కంది పంట సాగు ప్రతి ఏడాది పెరుగుతుండడంతో పప్పు దినుసుల కొరత కూడా తీరనుందని రైతులు ఆశిస్తున్న సమయంలో పంటలకు తెగుళ్లు సోకుతున్నాయి. దీంతో కంది పంటకు తీవ్ర నష్టం కలిగిందని రైతులు వాపోతున్నారు. మొక్కలు పాలిపోయి ఆకులు ఎర్రగా మారి రాలిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. కంది పంటలో గడ్డి విపరీతంగా పెరగడంతో కొంత మంది రైతులు గడ్డి మందు పిచికారీ చేస్తుండగా మరికొంత మంది రోజు వారీగా కొంత కలుపు తీసుకుంటూ తంటాలు పడుతున్నారు.

దిక్కుతోచని స్థితిలో రైతులు..

ఈ ఏడాది సోయా, పత్తి పంటలు అనుకున్నంత దిగుబడి రాకపోయే అవకాశాలు ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కలిసి వస్తుందనుకున్న కంది పంట పూత రాలుతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. భారీ వర్షాల కారణంగా పత్తి పంట బాగా దెబ్బతింది. ప్రస్తుతం పూత దశలో ఉన్న కంది పంటను దక్కించుకునేందుకు రైతులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం చలికాలం కావడంతో ఉదయం, రాత్రి వేళల్లో పడుతున్న పొగమంచు కారణంగా పూత నేలరాలుతుందని రైతులు వాపోతున్నారు.

దిగుబడిపై ప్రభావం

జిల్లాలోని రైతులు పత్తి పంటతో పాటు కంది పంటను సైతం ప్రధానమైన పంటగా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం కంది పంట పూత దశలో ఉంది. పలు రకాల తెగుళ్లు సోకుతుండడంతో పూత రాలిపోతుంది. వర్షాలు లేక చెలక, నల్ల రేగడి భూముల్లో కంది మొక్కలు ఎర్రబడుతున్నాయి. అంతేకాకుండా గడ్డి విపరీతంగా పెరగడం, మొక్కలకు ఎండు తెగుళ్లు సోకే ప్రమాదం కూడా ఉంది. దీంతో కంది పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కంది పంటకు తెగులు ఆశించినట్లయితే తమ సూచనల మేరకు మందులు పిచికారీ చేసుకోవాలని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

రాలుతున్న పూత



ప్రస్తుతం కంది పంట పూత, కాత దశలో ఉంది. ఉదయం, రాత్రి వేళల్లో పొగమంచు కురుస్తుండడం.. రెండు నెలల నుంచి వర్షాలు లేకపోవడంతో పంటకు పలు రకాల తెగుళ్లు సోకుతున్నాయి. దీంతో కంది పంట పూత, కాత రాలిపోతుంది. తెగుళ్ల నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం కందికి రూ.10 వేలు మద్దతు ధర కల్పించాలి.

\- దిలీప్, యాపలగూడ

మందులు పిచికారీ చేయాలి



పూత రాలిపోతుంటే బోరాన్ 200 గ్రాములు, కాల్షియమ్ నైట్రేట్ ఒక ఎకరానికి పిచికారీ చేయాలి. పురుగు ఉంటే కోరాజన్ పిచికారీ చేయాలి. ప్రస్తుతం మంచు పడుతుండడంతో కంది పంటలో పూత, కాత రాలిపోతుంది. మంచు కురవకుంటే పంట దిగుబడిలో ఎలాంటి ఇబ్బంది ఉండదు. రైతులు ఆందోళన చెందవద్దు. వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి.

\- పి.రాజేశ్, ఏవో

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల ఘర్షణ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం రాత్రి బీఆర్‌ఎస్ మద్దతుదారులు కాంగ్రెస్ నాయకులను అడ్డుకున్నారు. రాత్రి 11 గంటల సమయంలో కాలనీలో ప్రచారం నిర్వహించొద్దని యువకులు రోడ్డుకు అడ్డంగా బైక్‌లు పెట్టడంతో కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో అక్కడికి చేరుకున్న పోలీసులు తమపై లాఠీచార్జి చేసినట్లు బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిని అడ్డుకోకుండా తమపై లాఠీచార్జి చేయడం ఏంటని ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కాగా కాలనీలోని తమ పార్టీ నాయకుడి ఇంట్లో భోజనానికి వెళ్తున్న తమను బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకొని, ఘర్షణకు దిగారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ

కెరమెరి: ఈ నెల 30న నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల సామగ్రిని మంగళవారం తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సేవంతా అధికారులకు పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 29 పోలింగ్‌బూత్ కేంద్రాలు ఉండగా, 31 గ్రామ పంచాయతీల్లో 23,190 ఓటర్లున్నారు. ఎన్నికల సందర్భంగా వాల్‌పోస్టర్లు, పోల్ చీటీలు, ఫ్లెక్సీలు, కరపత్రాలు, టార్పాలిన్‌లను ఆయా పోలింగ్ బూత్ కేంద్రాల బీఎల్‌వోలకు పంపిణీ చేశారు.



బీఎల్‌వోకు సామగ్రి అందజేస్తున్న సేవంతా

ప్రహరీ లేక పాట్లు



కెరమెరి: మండలంలోని రాంనగర్ పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల కాలం నుంచి పాఠశాల కొనసాగుతున్నప్పటికీ అధికారులు ప్రహరీ నిర్మించడంలో విఫలమయ్యారు. దీంతో పశువులు పాఠశాల ఆవరణలో సంచరిస్తున్నాయి.

ప్రజల భద్రత కోసమే కార్డన్ సెర్చ్

తానూరు: ప్రజల భద్రత కోసమే పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ముధోల్ సీఐ వినోద్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్వి గ్రామంలో తెల్లవారుజామున కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సీఐ ఆధ్వర్యంలో నలుగురు ఎస్సైలు, 50 మంది పోలీస్ సిబ్బంది ఇళ్ల ముందు నిలిపిన వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. కిరాణదుకాణాల్లో తనిఖీ చేశారు. ఈసందర్భంగా సరైన పత్రాల్లేని ఆరు ఆటోలు, నాలుగు ఫోర్‌వీలర్లు, 86 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనాదారులు తప్పనిసరిగా అన్ని పత్రాలు ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సైబర్ నేరాలు, మోసాలు జరుగుతున్న తీరును వివరించారు. ఎస్సై సందీప్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వైభవంగా సప్తాహం ముగింపు

బేల: మండలకేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా ఆలయప్రాంగణంలో వారం రోజులుగా కొనసాగుతున్న బాబా సప్తాహ ముగింపు వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్థానిక హనుమన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర ర్యాలీ చేపట్టారు. పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. తర్వాత బాజీరావు బాబా ప్రధాన శిష్య బృందం ఆలయ ప్రాంగణంలో భగవద్గీత పారాయణం చేపట్టారు. దీంతోపాటు భజన, కీర్తనలను ఆధ్యాత్మిక సంబోధనతో కొనసాగించారు. చివరగా కాలదహీ హండిని చేపట్టి, తీర్థ ప్రసాదాలను భక్తులకు అందించారు. అన్నదానం నిర్వహించారు.

కోరం లేక సమావేశం వాయిదా

నేరడిగొండ: ఎంపీడీవో సమావేశమందిరంలో మంగళవారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ రాథోడ్ సజన్ ప్రకటించారు. వడూర్ ఎంపీటీసీ అంబేకర్ పండరి, చిన్నబుగ్గారం ఇన్‌చార్జి సర్పంచ్ విలాస్, ఎంఈవో భూమారెడ్డి, ఏఈవో జైపాల్, పశువైద్య శాఖ అధికారి, ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు హాజరయ్యారు. తక్కువ సంఖ్యలో ప్రజాప్రతినిధులు హాజరుకావడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. సమావేశం తిరిగి నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో శోభన తెలిపారు.

రంగురంగుల పూలు!



చింతలమానెపల్లి: టోంకిని పాదయాత్ర సందర్భంగా సిర్పూర్ (టి) మండలం టోంకిని ఆలయం ఎదుట రంగురంగుల పూల దుకాణాలను ఏర్పాటు చేశారు. కృత్రిమంగా తయారు చేసిన ఆకుపచ్చని గడ్డి, తీగలు, పూలు ఆకట్టుకునేలా ఉండడంతో భక్తులు పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు.

విద్యార్థులకు అవగాహన

ఇచ్చోడ: మహిళా సాధికారతపై ప్రతీ విద్యార్థి అవగాహన ఉండాలని జీసీడీవో మెస్రం చాయ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మహిళా సాధికారతపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జీసీడీవో మాట్లాడుతూ ఉత్తమ సమాజం కోసం బాలలే పునాదులు అవుతారని తెలిపారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. బాలల హక్కులకు భంగం కల్గితే 1098 కాల్ చేయాలన్నారు. కాత్లె ఉత్తం దాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం

లక్ష్మణచంద: మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన సంగెం బద్దెన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు అతడిని ఇంటి వద్ద పరామర్శించి రూ.15 వేల ఆర్థికసాయం అందించారు. బద్దెన్న తన టీవీఎస్ ఎక్సెల్‌పై నిర్మల్‌లో జరిగిన సీఎం కేసీఆర్ ప్రజాశీర్వాద సభకు వెళ్తుండగా నిర్మల్‌రూరల్ మండలం కొండాపూర్ వద్ద కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయన కాలు విరగడంతో ఆర్థికసాయం అందించారు. బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి, మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, లింగారెడ్డి, నారాయణ ఉన్నారు.

విద్యార్థుల ర్యాలీ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలలో సేఫ్ అన్ రోడ్ (సురక్షిత ప్రయాణం)లో భాగంగా మంగళవారం స్థానిక శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. పాఠశాల నుంచి కాలేజీరోడ్, ఓవర్‌బ్రిడ్జి వరకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. వాహన చోధకులకు పుష్పాలు అందజేస్తూ హెల్మెట్, సీటు బెల్ట్ ధరించటం, ట్రాఫిక్ నిబంధనలపై వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జోబిన్, ఇన్‌చార్జి వెన్నెల, ఏవో విలాస్, పీఈటీ రాజేందర్ పాల్గొన్నారు.

సాగునీటికి బావులు ఉపయోగకరం

కెరమెరి: సాగునీటి కోసం బావులు ఎంతో ఉపయోగకరమని ఈజీఎస్ ఏపీవో మల్లయ్య అన్నారు. మంగళవారం మండలంలోని బోరిలాల్‌గూడలో చౌహాన్ దత్తు తన పొలంలో ఉపాధిహామీ నిధులతో నిర్మించిన బావిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాబ్ కార్డు ఉన్న ప్రతీ రైతు తన పొలంలో బావి తవ్వుకోవచ్చని పేర్కొన్నారు. ఒక్కో బావికి రూ.3 లక్షల వరకు నిధులు కేటాయిస్తామని తెలిపారు. కాగా మండల కేంద్రంతో పాటు అనేక గ్రామాల్లో ప్రధాన రహదారుల పక్కన ఉన్న ఎవెన్యూ ప్లాంటేషన్‌ను గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి టీఏలు పరిశీలించారు.



బావిని పరిశీలిస్తున్న ఏపీవో మల్లయ్య

ఎన్నికల నిర్వహణపై అవగాహన ఉండాలి

చెన్నూర్: శాసన సభ ఎన్నికల నిర్వహణ, ప్రవర్తనా నియామవళిపై అధికారులకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోశ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, ఇతర ప్రిసైడింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా విధులు నిర్వర్తించాలన్నారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు అందించిన హ్యాండ్‌బుక్ పై అవగాహన ఉండాలన్నారు. పోలింగ్, కౌటింగ్ కార్యక్రమాల్లో ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. ఈ నెల 30న జరిగే పోలింగ్ రోజున ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. ఈవీఎంలో ఎలాంటి సాంకేతిక సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాలలో 743పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలించాలని తెలిపారు. కార్యక్రమంలో చెన్నూర్ ఎన్నికల అధికారి సిడాం దత్తు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్లు సద్వినియోగం చేసుకోవాలి

బెల్లంపల్లి: ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. బెలంపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్‌తో కలిసి పోస్టల్ బ్యాలెట్లను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశంపై అధికారులు, సిబ్బంది తగిన అవగాహన కలిగి ఉండాలన్నారు. అప్రమత్తంగా ఉండి విధులు నిర్వర్తించాలని సూచించారు.

వాహనాల తనిఖీ

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి వంతెన వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మంగళవారం ముథోల్ సీఐ వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వాహనదారులు అన్ని పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. ఎస్సై సాయికుమార్, సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

లక్సెట్టిపేట: ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని సీఐ కృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని గురునానక్ ఫంక్షన్ హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన అభ్యర్థుల, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలు సజావుగా, సమర్థవంతంగా జరిగేలా అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు చూడాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నిర్వహించాలని తెలిపారు. అనుమతి లేకుండా పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించవద్దని, ఏమైనా సమస్యలుంటే ఫిర్యాదు చేయాలని కోరారు. జిల్లాలో సాయంత్రం పోలింగ్ 4గంటలకు ముగుస్తుందని, ఆ సమయంలోపు ఓటర్లు గేట్ లోపలికి వెళ్లాలన్నారు. ప్రచారాలు 48గంటల ముందు నిలిపివేయాలని తెలిపారు. అనంతరం ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఎస్సైలు లక్ష్మణ్, ప్రసాద్, రామయ్య, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.